అభివృద్ధి చేశా.. ఆశీర్వదించండి

● ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



నాగోలు రాక్‌టౌన్ కాలనీలో వాకర్స్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నాగోలు: ఎల్‌బీనగర్ నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేశానని తనను మరోసారి ఆశీర్వదించాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కాలనీ వాసులను కోరారు. బుధవారం చంపాపేట డివిజన్ ఉదయ్‌నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో కాలనీవాసులతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గాన్ని వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశానని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కాలనీవాసులను కోరారు. సుధీర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో వరద నీటి కాలువలు నిర్మించడంతో కాలనీల్లో ముంపు సమస్య పరిష్కారమైందని, వచ్చే ఎన్నికల్లో ఆయనకే తాము మద్దతు ఇస్తామని కాలనీవాసులు చెప్పారు. కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయం చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, నాయకులు గజ్జల మధుసూదన్ రెడ్డి, కుంట్లూర్ వెంకటేష్ గౌడ్, ఓరుగంటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రాక్‌టౌన్ కాలనీ పార్కులో ...

ఇలా ఉండగా, మార్నింగ్ వాక్‌లో భాగంగా సుధీర్ రెడ్డి బుధవారం ఉదయం నాగోల్ డివిజన్‌లోని రాక్‌టౌన్ కాలనీ పార్కులో వాకర్స్‌ను కలిశారు. పార్కును ఎంతో అభివృద్ధి చేశానని తెలిపారు. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని వాకర్స్‌ను కోరగా, వారు ఆయనకు మద్దతు ప్రకటించారు. చెరుకు ప్రశాంత్ గౌడ్, నాగోలు డివిజన్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, మహేష్ రెడ్డి, మాధవ రెడ్డి, రాంరెడ్డి, సుదర్శన్ రెడ్డి, వినోద్ రెడ్డి, మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరంలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం: కేఎల్‌ఆర్



కాంగ్రెస్‌లో చేరిన యువకులతో మహేశ్వరం కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి, దేప భాస్కరరెడ్డి తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ అడ్డా అని, ఇక్కడ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్‌ఆర్) అన్నారు. బుధవారం ఆర్‌కేపురం డివిజన్‌లోని వాసవి కాలనీలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిలుక ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వందలాది మంది యువకులు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం ఆర్‌కేపురం డివిజన్‌లోని టెలిఫోన్ కాలనీ, వాసవి కాలనీలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కేఎల్‌ఆర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలు పార్టీ అధికారంలో వచ్చిన వెంటనే అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహా రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూదన్ రావు, డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్ నేత, నల్లెంకి ధనరాజ్ గౌడ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రాణాలైనా ఇచ్చి కార్యకర్తలను కాపాడుకుంటా

● ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న మధుయాష్కీ

ఎల్‌బీనగర్: ''నేను గెలిస్తే నాకు రాజకీయ వారసులు లేరు.. కార్యకర్తలే నా వారసులు, నా ప్రాణాలైన ఇచ్చి కార్యకర్తలను కాపాడుకుంటా'' అని ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ అన్నారు. పార్టీ డివిజన్ అధ్యక్షులు, అనుబంధ సంస్థల నాయకులతో బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను ఎన్‌కౌంటర్లకే భయపడలేదని, అలాంటిది గుండాలకు భయపడతానా అని అన్నారు. నాతో తిరిగే కార్యకర్తల సమాచారం సేకరించి వారిని భయభ్రాంతులకు గురి చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు చూస్తున్నారని మధుయాష్కీ ఆరోపించారు. తాను పుట్టిన గడ్డ హయత్‌నగర్‌కు సేవా చేయాలనే ఉద్దేశంతో ఇక్కడి నుంచి పోటీ చేస్తున్నానని, తనకు మద్దతు ఇచ్చి గెలుపునకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మకుటం సదాశివుడు, లింగాల కిషోర్‌గౌడ్, సత్యనారాయణ, శ్రీనివాస్ యాదవ్, రమేష్ నాయక్, శ్రీనివాస్, యోగిశ్వర్‌రెడ్డి, స్వర్ణ మాధవి, కృష్ణ, మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లప్పుడు అందుబాటులో ఉంటా...

మన్సూరాబాద్: నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ అన్నారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా బుధవారం ఆయన హరిణ వనస్థలి జాతీయ పార్కు మన్సూరాబాద్ గేట్ వద్ద వాకర్స్‌ను కలుసుకుని ఓటు అభ్యర్థించారు. జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్‌లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాష్‌గౌడ్, శైలజారెడ్డి, పుష్పలత, కృపాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే బీఆర్‌ఎస్ ధ్యేయం



పెండ్యాల నగేష్, అరవింద్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరిన యువత

దిల్‌సుఖ్‌నగర్: ప్రజల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని బీఆర్‌ఎస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ అన్నారు. బుధవారం ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్ ఫేస్-1,2 లకు చెందిన యువత నగేష్ అరవింద్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మహేశ్వరం నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే మరోసారి మంత్రి సబితా ఇంద్రారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

రాజకీయ పార్టీలు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

- నామినేషన్లకు పకడ్బందీ ఏర్పాట్లు
- ఎన్నికల విధుల్లో సుమారు 3 వేల మంది సిబ్బంది
- ఇప్పటి వరకు రూ.8.18 కోట్ల నగదు సీజ్
- 'సాక్షి'తో ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఎన్నికల అధికారి పంకజ ప్రత్యేక ఇంటర్వ్యూ

ఎల్‌బీనగర్: నామినేషన్ల ప్రక్రియకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని, నిబంధనలు అతిక్రమించే రాజకీయ పార్టీలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ ఎన్నికల అధికారి పంకజ హెచ్చరించారు. ఎక్కడా కూడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల సందర్భంగా ఆమె 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు..

ప్రశ్న: నామినేషన్లకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: నామినేషన్ల కోసం ఇప్పటికే ఏర్పాట్లను పూర్తి చేశాం. నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటాం. నామినేషన్ల ప్రక్రియను సీసీ కెమెరాలు, వీడియోగ్రాఫర్స్‌తో ఎప్పటికప్పుడు రికార్డ్ చేస్తాం. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులు నామినేషన్ వేసేందుకు నలుగురికి, స్వతంత్ర అభ్యర్థికి 10 మందికి అవకాశం కల్పించాం.

ప్రశ్న: నామినేషన్ వేసే కార్యాలయం వద్ద ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ఈ సారి నామినేషన్లు స్వీకరించే ఎల్‌బీనగర్ జోనల్ కార్యాలయం వద్ద పకడ్బందీ చర్యలు చేపట్టాం. కార్యాలయం చుట్టూ వంద మీటర్ల వరకు ఇతరులకు, వాహనాలకు అనుమతించడం లేదు. నామినేషన్ల ప్రక్రియ ముగిసే వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుంది.

ప్రశ్న: అభ్యర్థులకు నామినేషన్లపై సందేహాల నివృత్తికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: అభ్యర్థుల సందేహాల నివృత్తి కోసం ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశాం. అభ్యర్థులకు ఉన్న అన్ని సందేహాలను నివృత్తి చేసే విధంగా సిబ్బందికి శిక్షణ ఇచ్చాం.



పంకజ, ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఎన్నికల అధికారి

ప్రశ్న: ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ఎంత నగదు, బంగారం, మద్యం పట్టుకున్నారు?

జవాబు: ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి మంగళవారం ఉదయం వరకు అక్రమంగా తరలిస్తున్న 94 మంది నుంచి రూ.8.18 కోట్ల నగదు, సుమారు 58 తులాల బంగారం, 308 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నాం. దానిలో సరైన పత్రాలు చూపించిన ముగ్గురికి రూ.1.18 కోట్లు తిరిగి ఇచ్చేశాం. మిగతా వారు కూడా సరైన పత్రాలు చూపించి తమ డబ్బును తీసుకెళ్లవచ్చు.

ప్రశ్న: ఎన్నిల ఖర్చును ఏ విధంగా లెక్కిస్తారు?

జవాబు: ఎన్నికల ఖర్చు ఏ విధంగా లెక్కిస్తామనేది అవగాహన కోసం అభ్యర్థులకు పూర్తి వివరాలతో కూడిన పుస్తకాన్ని అందజేస్తాం. ఈ నెల 3వ తేదీ నుంచి ఖర్చుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసేందుకు ప్రత్యేక అధికారి అందుబాటులో ఉంటారు. ప్రతి వస్తువుకు ఎన్నికల సంఘం ధరను నిర్ణయించింది. వాటి ప్రకారమే ఖర్చును లెక్కిస్తాం.

ప్రశ్న: వాహనాలు, కార్యాలయాల ఏర్పాటు, ఇతర అనుమతులకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ప్రచార వాహనాలు ఇతర అనుమతుల కోసం నామినేషన్ల స్వీకరించే కార్యాలయంలోనే సింగిల్ విండో ఏర్పాటు చేశాం. అనుమతులు ఇచ్చేందుకు అన్ని విభాగాల అధికారులు ఇక్కడే అందుబాటులో ఉంటారు. పత్రాలు సరిగ్గా ఉంటే వెంటనే అనుమతులు మంజూరు చేస్తాం.

ప్రశ్న: పోలింగ్ స్టేషన్‌కు రాలేని వారికి ఎలాంటి అవకాశాలు కలిపిస్తున్నారు?

జవాబు: ఓటు వేసేందుకు పోలింగ్ స్టేషన్‌కు రాలేని పరిస్థితి ఉన్న వారు ఓటు వేసే విధంగా చర్యలు తీసుకున్నాం. 80 ఏళ్లు దాటిన వారిని, దివ్యాంగులను, ఇతర సమస్యలు ఉన్న వారిని 8385 వేల మందిని గుర్తించి వారికి ఇప్పటికే దరఖాస్తులు అందజేశాం. ఎన్నికల రోజున వారి నుంచి బ్యాలెట్ బాక్స్ ద్వారా ఓట్లను సేకరిస్తాం. అంధుల కోసం ఓటింగ్ మిషన్లపై బ్రెయిలీ లిపిలో అంకెలను ఏర్పాటు చేశారు.

ప్రశ్న: ఓటింగ్ శాతం పెరిగేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

జవాబు: ఓటింగ్ శాతం పెంచేందుకు ఇప్పటికే అవగాహన కల్పించాం. నియోజకవర్గంలో సుమారు 50 ప్రాంతాల్లో ఓటింగ్ పెంచేందుకు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపడతాం.

వాహన తనిఖీల్లో రూ.7.50 లక్షలు స్వాధీనం

నాగోలు: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు ఓ వ్యక్తి ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.7. 50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బుధవారం సాయంత్రం చింతలకుంట చౌరస్తాలో ఎల్‌బీనగర్ పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా వాసుదేవ్ అనే వ్యక్తి కారులో రూ. 7, 50 లక్షలు తీసుకొని వెళ్తున్నాడు. పోలీసులు అతని వద్ద నుంచి నగదును స్వాధీనం చేసుకుని ఎల్‌బీనగర్ అసెంబ్లీ ఎన్నికల అధికారి ముందు హాజరుపరిచారు.

ఎమ్మెల్యే కారును తనిఖీ చేసిన పోలీసులు



సుధీర్‌రెడ్డి వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

చైతన్యపురి: తెలంగాణ ఎన్నికల నేపథ్యంలో వాహన తనిఖీల్లో భాగంగా బుధవారం ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి వాహనాన్ని ఆపి సోదా చేశారు. చైతన్యపురి పరిధిలోని చెక్ పోస్ట్ వద్ద ఇన్‌స్పెక్టర్ నాగార్జున ఆధ్వర్యంలో అటుగా వచ్చిన ఎమ్మెల్యే వాహనాన్ని ఆపారు. పోలీస్ సిబ్బంది కారు లోపల, డిక్కీలో క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీలు పూర్తయ్యే వరకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పోలీసులకు సహకరించి అనంతరం అక్కడ నుంచి తన కార్యక్రమానికి వెళ్లారు.

బీఆర్‌ఎస్‌కు ప్రజల నుంచి విశేష ఆదరణ

మలక్‌పేట అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి



సలీంనగర్ కాలనీవాసులతో అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి

మలక్‌పేట: బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని ఆ పార్టీ మలక్‌పేట అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి అన్నారు. బుధవారం మూసారంబాగ్ డివిజన్ సలీంనగర్ కాలనీ వాసులను, వాకర్స్ సభ్యులను కలిశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ పాలనలో ఎంతో అభివృద్ధి చెందిందని, మరోసారి అవకాశం కల్పిస్తే తెలంగాణ అన్ని విధాలుగా ప్రగతి పథంలో దూసుకెళ్తుందన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేయడంలో బీఆర్‌ఎస్ ఆదర్శంగా నిలిచిందన్నారు. సీఎం కేసీఆర్ హయాంలో కనివిని ఎరుగని అభివృద్ధి జరిగిందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని అజిత్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ టి. సునరితారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు చెల్లూరి రఘునందన్‌రెడ్డి, కాలనీవాసులు చంద్రశేఖర్, సామేల్, హనుమంతరావు పాల్గొన్నారు.

కేసు విచారణ వేగవంతం చేయాలని సీపీకి వినతి

సైదాబాద్: తమ ఇంట్లో జరిగిన దొంగతనం కేసు విచారణను వేగవంతం చేసి తనకు న్యాయం చేయాలని బాధితుడు నగర పోలీస్ కమిషనర్‌ను కోరాడు. ఈ మేరకు బుధవారం ఆయన సీపీకి మెయిల్ ద్వారా వినతి పంపించారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... సైదాబాద్ బ్యాంక్ కాలనీలో నివసించే రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి పి.శ్యాంసుందర్ రావు తన కుటుంబంతో కలిసి గతనెల 15న ఢిల్లీకి వెళ్లారు. 19న తిరిగి వచ్చి చూసే సరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోని నగదు, కొన్ని విలువైన వస్తువులు చోరీకి గురయ్యాయి. సీసీ ఫుటేజీను సైతం దొంగలు ధ్వంసం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అయితే తన ఇంట్లో దొంగతనం జరిగి 15 రోజులైనా కేసులో పురోగతి లేదని, త్వరగా విచారణ జరిపి తగిన న్యాయం చేయాలని శ్యాంసుందర్‌రావు పోలీసు కమిషనర్‌ను కోరారు. వినతి పత్రాన్ని సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ, సైదాబాద్ ఏసీపీలకు కూడా పంపానని తెలిపాడు.

హింసా రాజకీయాలపై చర్యలు తీసుకోండి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి సామ సుందర్‌రెడ్డి

సైదాబాద్: కాంగ్రెస్ పార్టీ హింసా రాజకీయాలపై పోలీస్ శాఖ తగిన చర్యలు తీసుకోవాలని యాకుత్‌పురా బీఆర్‌ఎస్ అభ్యర్థి సామ సుందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి సైదాబాద్ మండల తహసీల్దార్ జయశ్రీని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సామ సుందర్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలోని రాజకీయ నాయకుల్లో అత్యంత సౌమ్యుడు, మృదుస్వభావిగా పేరుగాంచి, రెండుసార్లు ఎంపీగా గెలిచి ప్రస్తుత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా బరిలో దిగిన కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. ఆయనపై హత్యాయత్నానికి దుండగుడిని పురిగొల్పిన వారిని కనిపెట్టి శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారం కోసం అడ్డదారులు తొక్కుతున్న కాంగ్రెస్‌కు ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్తారన్నారు. కార్యక్రమంలో ఐఎస్‌సదన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మెట్టు భాస్కర్‌రెడ్డి, దర్శనం నర్సింగ్‌రావు, చింతల శ్రీనివాస్, సాయిబాబా, ఎజాజ్, రజా అలీ మీర్జా పాల్గొన్నారు.

హామీల అమలులో కేసీఆర్ విఫలం: అందెల

మీర్‌పేట: ఎన్నికల హామీల అమలులో సీఎం కేసీఆర్ విఫలమయ్యారని మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ బీజేపీని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించాలని కాషాయశ్రేణులకు ఆయన దిశానిర్దేశం చేశారు. బుధవారం మీర్‌పేటలో బీజేపీ నాయకుడు పెండ్యాల నర్సింహా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీర్‌పేట ప్రాంతంలో లెనిన్ నగర్‌తో పాటు ఇతర ప్రాంతాలు అభివృద్ధి చేయలేదని తెలిపారు. బీజేపీ అధికారంలోకి వస్తే బస్తీలను అభివృద్ధి చేయడంతో పాటు ఇంటి పన్నులను తగ్గిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో పాపయ్యగౌడ్, నర్సింహారెడ్డి, జంగయ్య యాదవ్, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

జీవితంపై విరక్తితో గృహిణి ఆత్మహత్య



స్వాతి (ఫైల్)

నాగోలు: ఉన్నత చదువులు చదువుకోవడానికి శరీరం, కళ్లు సహకరించడం లేదని గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. రంగా రెడ్డి జిల్లా యాచారం మండలం చింతపట్ల గ్రామానికి చెందిన ధనుంజయ, స్వాతి (38) భార్యాభర్తలు. ఇద్దరు కుమారులతో కలిసి హస్తినాపురంలో ఉంటున్నారు. పెద్ద కుమారుడు 8వ తరగతి, రెండో కుమారుడు 3వ తరగతి చదువుతున్నాడు. ధనుంజయ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నా డు. బుధవారం ఉదయం స్వాతి భర్తకు టిఫిన్ బాక్స్ పెట్టి పంపింది. కుమారులు పాఠశాలకు వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న స్వాతి జీవితంపై విరక్తితో పడక గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆ త్మహత్య చేసుకుంది. భర్త పలుమార్లు ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో అతను ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటి తలుపులు వేసి ఉన్నాయి. పిలిచినా తలుపులు తీయకపోవడంతో గ్లాసులను పగులగొట్టి ఇంట్లోకి వెళ్లి చూడగా స్వాతి పడక గదిలో సీలింగ్ ఫ్యాన్ కు ఉరేసుకొని కనిపించింది. మృతురాలి సోదరి ఫిర్యాదు మేరకు ఎల్‌బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలు చనిపోయే ముందు 'తాను ఉన్నత చదువుల కోసం ఎంతో కష్టపడుతున్నానని, నాకు శరీరం సహకరించడం లేదు, కళ్లు సక్రమంగా కనిపించపోవడంతో జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకుంటున్నా ను, నా చావుకు ఎవరు కారణం కాదు' అని సూసైడ్ నోట్ రాసి చనిపోయింది.

అయ్యప్ప భక్తులకు నిత్యాన్నదానం ప్రారంభం

మన్సూరాబాద్: డివిజన్ పరిధిలోని అయ్యప్ప ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు నిత్యాన్నదాన కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 57 రోజుల పాటు అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో సత్యప్రియ గురుస్వామి, పాలచందర్‌రావు, వెంకయ్య, జాలయ్య, అంజయ్య, నాయకులు నాంపల్లి శంకరయ్య, పోచబోయిన గణేష్‌యాదవ్, గణేష్‌గౌడ్, కేపీ ప్రసాద్ పాల్గొన్నారు.



నిత్యాన్నదాన కార్యక్రమానికి పూజలు చేస్తున్న సామ రంగారెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా 25, వంకాయ 23, బెండ 35, పచ్చిమిర్చి35, కాకర 23, బీర 28, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 13, క్యారెట్ 28. దొండ 18, ఆలు 21, ఉల్లి 48, గోకర 23, దోస 15, సొర 11, పొట్ల 13, అరటి 09, చిక్కుడు 65, అర్వి 35, మునగ 85, చిలగడదుంప 45, బీట్‌రూట్ 23, కీర 28, ఫ్రెంచ్ బీన్స్ 55, కాప్సికమ్ 35. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

పేకాటరాయుళ్ల అరెస్ట్

హస్తినాపురం: గుట్టు చప్పుడు కాకుండా పేకాటాడుతున్న 8 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ జలంధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆటోనగర్‌లోని ఒక గదిలో పేకాటాడుతున్నట్టు సమాచారం అందడంతో బుధవారం తెల్లవారు జామున పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న కట్ల మహేశ్, వేముల రాజేశ్, వల్లపు ఉపేందర్, మనుపాటి వెంకన్న, బొంత వెంకటేశ్ , కొమ్మెర రమేశ్, మనుపాటి దశరథ, మనుపాటి దుర్గాప్రసాద్‌లను పట్టుకున్నారు. వారివద్ద నుంచి రూ. 34 వేలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'ఓటరు జాబితాలో పేరుంటేనే పీఎస్‌లోకి అనుమతించాలి'

మలక్‌పేట: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మూసారంబాగ్ శ్రీపురం కాలనీ ఇండోర్ స్టేడియంలో బుధవారం మలక్‌పేట ఆర్‌ఓ ఆధ్వర్యంలో అదర్ పోలింగ్ ఆఫీసర్స్(పీఓపీ)లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మలక్‌పేట ఆర్‌ఓ ఉపేందర్‌రెడ్డి పోలింగ్ స్టేషన్ (పీఎస్) లో పీఓపీలు బాధ్యతలు, ఈవీఎంల పనితీరుపై అవగాహన కల్పించారు. ఓటరు జాబితాలో పేరు ఉన్న వ్యక్తిని మాత్రమే పోలింగ్ సెంటర్‌లోకి అనుమతించాలన్నారు. ఓటరు స్లిప్‌లోని పేరు, వివరాలు సరి చూసుకుని అన్ని సరిగా ఉంటే ఓటరు జాబితాలో టిక్ చేయాలని ఆర్‌ఓ సూచించారు. అనంతరం ఓటరు తనతో పాటు తీసుకొచ్చిన ఓటరు కార్డు, లేదా ఎన్నికల కమిషన్ అనుమతించిన 12 కార్డులలో ఏదైనా.. కార్డు వివరాలు రిజిష్టర్‌లో పొందుపరచాలన్నారు. ఓటరు సంతకం చేసిన తర్వాత చేతికి ఇంకు పెట్టి.. ఓటు వేయడానికి స్లిప్ అందజేయాలన్నారు. ఉదయం 400 మందికి, మధ్యాహ్నం 400 మంది.. మొత్తం 800 మంది ఓపీఓలకు శిక్షణ ఇచ్చారు.

బీజేపీ అభ్యర్థి గెలుపునకు సమష్టిగా పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మునిరత్నం నాయుడు, చిత్రంలో రంగారెడ్డి తదితరులు

నాగోలు: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించేందుకు ప్రతి ఒక్క నాయకుడు కార్యకర్తలా పనిచేయాలని కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే, పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి మునిరత్నం నాయుడు పిలుపునిచ్చారు. బుధవారం నాగోలు శుభం కన్వెన్షన్‌లో బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని పార్టీ కార్పొరేటర్లు, జిల్లా నాయకులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మునిరత్నం నాయుడు మాట్లాడుతూ, నాయకులు కార్యకర్తలు సమష్టిగా పనిచేసి ఎల్‌బీనగర్‌లో బీజేపీ అభ్యర్థిని గెలిపించుకోవాలని సూచించారు. బలోపేతం కోసం సోషల్ మీడియా ద్వారా నిరంతరం ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కళ్లెం రవీందర్‌రెడ్డి, వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్లు చింతల అరుణ సురేందర్ యాదవ్, నరసింహ గుప్తా, కొప్పుల నర్సింహారెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, నాయికోటి పవన్‌కుమార్, లచ్చిరెడ్డి, ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణపతి హోమం

చంచల్‌గూడ: సంకష్ట చతుర్థి సందర్భంగా కుర్మగూడ డివిజన్ ఇష్కల మఠం హనుమాన్ ఆలయంలో బుధవారం గణపతి హోమం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు కృష్ణమాచారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు, పెద్ద సంఖ్యలో భక్తులు హోమంలో పాల్గొన్నారు. అనంతరం ప్రసాద వితరణ జరిగింది.

పక్కాగా నిబంధనలు అమలు

- నామినేషన్ కేంద్రంలోకి అభ్యర్థితో పాటు ఐదుగురికే అనుమతి
- నవంబర్ 3 నుంచి 10వరకు నామినేషన్ల స్వీకరణ
- అభ్యర్థుల నేరాల వివరాలు పొందుపరచాలి
- మలక్‌పేట ఆర్‌ఓ కె.వెంకట ఉపేందర్‌రెడ్డి



చాదర్‌ఘాట్: నామినేషన్లు వేయడానికి వచ్చే అభ్యర్థితో పాటు నలుగురిని మాత్రమే నామినేషన్ కేంద్రంలోకి అనుమతిస్తామని మలక్‌పేట నియోజకవర్గం రిటర్నింగ్ ఆఫీసర్ కె.వెంకట ఉపేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మలక్‌పేటలోని కార్యాలయంలో మాట్లాడుతూ, నామినేషన్ల ప్రక్రియ నవంబర్ 3 నుంచి 10 వరకు కొనసాగుతుందన్నారు. ప్రతి రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు వేయవచ్చన్నారు.నామినేషన్ వేయడానికి వచ్చే అభ్యర్థులు తప్పనిసరిగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలన్నారు. ఏదైనా సమస్య, సందేహాలు ఉంటే ఎన్నికల కార్యాలయంలో సంప్రదించాలన్నారు. అభ్యర్థి వాహనంలో పాటు మరో రెండు వాహనాలు మాత్రమే అనుమతిస్తామన్నారు. ఓసీలు రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీలు రూ. 5 వేలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలని తెలిపారు.

జత చేయాల్సినవి ఇవే...

- నామినేషన్ పత్రాలతో పాటు ఫారం-26, ఫారం-2(20) జత పర్చాలి
- అలాగే నో డ్యూస్ సర్టిఫికెట్ జత చేయాలి.
- ప్రమాణం చేసే సర్టిఫికెట్‌ను కూడా నామినేషన్ పత్రంతో ఇవ్వాలి.
- సర్టిఫైడ్ ఎక్స్‌ట్రాక్ట్ పత్రాలు తప్పనిసరి
- గుర్తింపు పొందిన పార్టీలు అయితే ఫారం-ఏ, ఫారం-బి జత చేయాలి
- అఫిడవిట్‌లో ఖాళీలు ఉంచకూడదు. అఫిడవిట్‌ను నోటరీ చేయించాలి
- అభ్యర్థి జైలుశిక్ష అనుభవించి ఉంటే నేరనిరూపణ అయి ఉంటే ఆ వివరాలు డిక్లేర్ చేయాలి
- ప్రపోజల్ చేసే ఓటరు తప్పనిసరిగా నియోజకవర్గానికి చెందిన వారై ఉండాలి
- గుర్తింపు పొందిన పార్టీ అభ్యర్థికి ఒక ప్రపోజల్ సరిపోతుంది.
- మిగతా అభ్యర్థులు పది మంది ప్రపోజల్స్ చేయాల్సి ఉంటుంది
- ఉద్యోగం నుంచి తొలగించబడ్డ ప్రభుత్వ ఉద్యోగి పోటీ చేయాలి అనుకుంటే సదరు ఉద్యోగం నుంచి ఎందుకు తొలగించబడ్డాడో తప్పనిసరిగా సంబంధిత పత్రాలు సమర్పించాలి.
- అభ్యర్థుల ఎన్నికల వ్యయానికి సంబంధించిన రిజిస్టర్‌ను నామినేషన్ రోజు అందజేస్తారు.
- అభ్యర్థి ఖర్చులను కొత్తగా తెరిచే బ్యాంక్ అకౌంట్ నుంచే లావాదేవీలు జరపాలి.